

MADE IN

**సబ్బెళ్ళ ధైవాల్‌రెడ్డిగారిది అనపర్తి. ఆయన డూప్లికేటు బ్రాందీ తయారు చేసేవాడు. ఆ పని చెయ్యడానికి వాళ్ళ అనపర్తిలో కంటే మావూళ్ళో ఎక్కువ సౌకర్యంగా ఉండటంతో చెల్లెలు మేడచెల్లాయమ్మ ఉండే మా వూరు వచ్చేవాడు.**

ఎక్కడ్నుంచో తెచ్చిన స్పిరిట్‌లో కావల్సిన పాళ్ళలో నీళ్ళు కలిపి మిఠాయి రంగులాంటిదీ, ఎసెన్సూ లాంటిదీ కలిపి ఇంకా ఏంటేంటో కలిపి డూప్లికేటు బ్రాందీ తయారు చేసి కొత్త సీసాల్లో ఆ బ్రాందీ పోసి, ఆ సీసాలకి కొత్త లేబిల్సు అతికించి కొత్త మూతలు బిగిస్తే అది అచ్చం ఒరిజినల్ బ్రాందీ సీసాల కంటే బాగుండేవి. అతనా పని చేస్తున్నప్పుడు ఎలాగ కలిసేడో కోర్రాములుగారి బస్సులో క్లీనరు పనిచేసే పుత్రయ్య కలిసేడు. ధైవాల్‌రెడ్డికీ పుత్రయ్యకీ బాగా కుదిరింది జోడీ. బ్రాందీ సీసాల కేసుల్ని ఎవరికీ చెప్పి పెట్టకండా తెల్లవారు ఝాము ఫస్టు బస్సులోకి ఎక్కించి రాజమండ్రిలో నల్లమందుసందులో ఉన్న ఒక మార్వాడీ ఇంట్లో జేర్చాలి. ఆ పని చేసినందుకు కేసుకి ఇంత అని ముట్ట జెప్పేవాడు ధైవాల్‌రెడ్డిగారు.

చాలా హుషారుగా ఆ పని చేసుకుంటా పోతున్న పుత్రయ్యకి తాగుడు బాగా అలవాటయ్యింది ఆడి తాగుడు గురించి తల్సుకుంటేనే నవ్వూ ఏడుపూ కలిసొచ్చేస్తుంది. సీసా బిరడాతీస్తే దాంట్లోంచి బయటికొచ్చిన జీబూతం లాగ మందు కొట్టేడంటే మారిపోతున్నాడు. పదిమందిని కొట్టే బలం వచ్చేస్తంది. దాంతో అమ్మోరు పూనినట్టు ఊగిపోయేవాడు. అది చూసిన భార్యాకొడుకూ ఒకటే బెంబేలెత్తిపోతున్నారు. నోట్లోంచి బూతుకానాలు తప్ప ఇంకేం రావడం లేదు. ఊళ్ళో పెద్ద పెద్దోళ్ళని కూడా తిట్టేసేవాడు. ఆడు వాగుతున్నాడని తెల్సిన వాళ్ళంతా ''ఏదో వాగుతున్నాడు తాగుబోతు ఎదవ... ఆడి మీద చెయ్యి చేసుకోడానికి ఆడి బతుకెంతనీ ఆడెంతనీ పోస్లే బక్కనాకొడుకు'' అనేసి ఒదిలేసేవారు.

ఆ సంగతి తెలీని పుత్రయ్య తనకి భయపడి వదిలేస్తున్నారనుకుని ఇష్టానికి రెచ్చిపోడం మొదలెట్టేడు.


రాత్రంతా తాగి పశువులాగ ప్రవర్తించిన పుత్రయ్యని మర్నాడు పొద్దుట ''ఏంట్రా రాత్రి అలా చేసేవు?'' అంటే తలొంచుకుని ''ఏంటో ఎదవమందు అనవసరంగా అలవాటయ్యింది తాగినప్పుడు నేనేం చేస్తున్నానో నాకే తెలవడం లేదు తప్పయిపోయిందండి'' అనేసి కాళ్ళు పట్టేసుకుని ఏడ్చేసేవాడు.

చెల్లెలు చెల్లాయమ్మగారింటికొచ్చి వెళ్ళే సబ్బెళ్ళ ధైవాల్‌రెడ్డిగారు ఈ డూప్లికేటు బ్రాందీ వ్యాపారం విషయంలో పోలీసులకి దొరికిపోయే పరిస్థితొచ్చి పెర్మనెంటుగా వైజాగెళ్ళిపోయేడు.

దాంతో,

పుత్రయ్య ఆదాయం పడిపోయింది. తాగుడు అలవాటు వుట్టుకి బాగా పెరిగిపోయింది.

వాడిగోల భరించలేక పన్లోంచి తీసేసేడు కోర్రావులుగారు. ఇక ఇక్కడ్నుంచి జూస్కోవాలి. దార్లో ఎవడన్నా ఎదురైతే అప్పడిగేవాడు. ఆ మనిషి ఇవ్వనంటే అప్పుడేం అనేవాడు కాదు. తాగేసేకా ఆ ఇవ్వనన్న మనిషి ఇంటికెళ్ళి బయటికి పిల్చి మరీ తిట్టేవాడు. ఆ తిట్లకీ కేకలకీ జనం పోగయ్యేవారు... అది భరించలేని ఆ మనిషి అయిదో పదో ఇస్తే దాన్ని అందుకున్న పుత్రయ్య ''ఇది పొద్దుటే ఇచ్చేసుంటే ఇంత పెంట ఉండదు



గదా?'' అనేసి కుందయ్య సారాకొట్లో కెళ్ళిపోయేవాడు.

ఊళ్ళో రెడ్ల కుర్రోళ్ళంతా లాకులు దాటి ముచ్చుమిల్లి వెళ్ళే రోడ్లో ఉన్న స్వరాజ్యరెడ్డిగారి పొలంలో పేకాడ్తుంటే అక్కడికెళ్ళిన పుత్రయ్య ఓ పదిరూపాయిలిమ్మన్నాడు బ్రాకెట్టు ఆదిరెడ్డిగారి సత్యానందాన్ని.

''ఆట చాలా లాసులో నడుస్తుంది. అవతలకి పోవెహె'' అన్నాడు సత్యానందం.

''నాకు పదిస్తే మీకు వందొస్తది'' అన్నాడు పుత్రయ్య.

''రాపోయినా పర్లేదుగానీ బేడకాసుకూడా ఇవ్వన్నీకు బయటికిపోతావా లేదా?'' అని కసిరేడు సత్యానందం.

''బాబ్బాబు'' అని బతిమాల్న పుత్రయ్యని దూళ్ళపాక కిందకి దిగబాకిన బూడిద గుమ్మిడిపాదు మీదికి తోసేసేడు సత్యానందం.

''పోన్లెండి అలాగే ఉంటది'' అనుకుంటా సారాకొట్టు దగ్గరకెళ్ళిన పుత్రయ్య, కుందయ్య కాళ్ళట్టేసుకుని ఒక డ్రాము సారా అరువు తాగేసి బయటికొచ్చేడు.

బాగా పని చేస్తుంది మందు. కాస్సేపటికి బ్రాకెట్టాదిరెడ్డిగారి సత్యానందం గుర్తుకొచ్చేడు పుత్రయ్యకి. పక్కనించెళ్తున్న తాడి సూర్రెడ్డిగారి చింతాత సైకిలు లాక్కుని సరాసరి రామచంద్రపురం పోలీసుస్టేషన్కెళ్ళిన పుత్రయ్య ''మావూరి కర్రి స్వరాజ్యరెడ్డిగారి పొలంలో పేకాట వేలమీద జరిగిపోతందండి బాబూ'' అనేసి ఉన్నయ్యీ లేనియ్యీ కలగాపులగం జేసి చెప్పేసరికి ఎస్సైగారు మోటారు సైకిలు మీదా, హెడ్డు గవర్రాజూ, పోలీసులూ సైకిళ్ళమీదా తుపాకులు భుజాలకి తగిలించుకుని మరీ బయల్దేరి పోయి ఆ పేకాట జరిగేచోటకొచ్చి అందర్నీ చితగ్గొట్టేసి బట్టలిప్పించి చారల డ్రాయర్లతోనూ లంగోటాలతోనూ వీధులమ్మట ఊరేగిస్తుంటే గోలగోలగా తయారైంది వాతావరణం. వీధుల్లో ఆడోళ్ళంతా అరుగుల మీద కొచ్చి దేవుడి సంబరం వెళ్తున్నట్టు చూస్తున్నారు. ఓ పక్కనించి ఏడుస్తానే పుత్రయ్య దగ్గరకొచ్చిన సత్తిసూర్నాణరెడ్డిగారి చిట్టి ''ఇదేం పెంట పనిరా పుత్రయ్యగా?'' అన్నాడు.

''మరి నేను అడిగిన అయిదురూపాయలూ ఇచ్చేస్తే ఇంత పెంట ఉండదుగదా'' అనేసి ఏడుస్తా వెళ్తున్న చిట్టిని వెనక్కి పిల్చిన పుత్రయ్య ''ఓ పదుంటే ఇద్దురూ'' అన్నాడు.

* * *

పుత్రయ్యగాడి దెబ్బకి జడిసిపోతన్న వూరి జనం వాడు అంతదూరంలో కనపడగానే ఏదో పనున్నట్టు యాక్షను చేస్తా వెనక్కెళ్ళిపోతున్నారు. లేదా ఏం కనబడితే దానెనకాల దాక్కుంటున్నారు. ఒకరోజు ఎదురొస్తున్న పుత్రయ్యని చూసి కరణాల గోడెనకాల దాక్కున్న తాడిగనిరెడ్డిని పేరంటాల జెర్రి (ఇది కుడితే బాధ మూడురోజులుంటుంది) కుట్టేసింది.

ఆరోజు పొద్దుట్నుంచీ మందు పళ్ళేదు పుత్రయ్యకి. చేతులూ కాళ్ళూ తెగ లాగేస్తున్నాయి.

అడగడానికి ఊళ్ళో ఎవరూ కనపడ్డం లేదు. అసలెవరూ దొరకడవేలేదు. అంతలో ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తుకురాని పిసినిగొట్టు చంటమ్మగారు గుర్తుకొచ్చింది. ఆళ్ళింటికెళ్ళి నోరు తెరిచి అడిగేడు.

''ఏరా తాగున్నావా మామూలుగా ఉన్నావా?'' అనడిగింది చంటమ్మ.

''పొద్దుట్నుంచీ ఏం ముట్టుకోలేదు సంటమ్మగారూ అందుకే ఓ అయిదుంటే ఇమ్మని అడగడానికొచ్చేను'' అన్నాడు పుత్రయ్య.

వాడి జవాబు విని తెగరెచ్చిపోయిన చంటమ్మ ''ఎదవ సచ్చినోడా... గొల్లిగా నాగురించి తెల్సికూడా నా గడప తొక్కుతావా నువ్వు...''

అంటా తెగ తిట్టిన చంటమ్మ చేటా చీపురుకట్టా పట్టుకుని ఆవీధి చివరిదాకా తరిమేసింది పుత్రయ్యని.

చంటమ్మదెబ్బకి పరుగుపందాల్లో పరుగెడ్తున్నట్టు వూరి వీధుల్లో పరిగెట్టిన పుత్రయ్య అప్పుడే చెల్లూరు సుగరు ఫేక్టరీలో డ్యూటీ జేసి సైకిలు మీదొస్తున్న స్టేజీ డ్రామాలేసే మల్లిడి గంగిరెడ్డిని గుద్దేసేసరికి ఇద్దరూ మెలికలు తిరిగిపడిపోయి దొర్లుకుంటూ కుళ్ళికాలవలోకి పోయేరు.

ఓపిక తెచ్చుకుని లేచిన పుత్రయ్య గంగిరెడ్డిని బతిమాలి పదినోటు లాగేసుకుని సారాకొట్టు దగ్గరకి పరుగెట్టేడు.

పొద్దుట్నుంచీ అసలు పడకపోవడం వల్ల మందు ఇలా లోపలికిలా వెళ్ళిందో లేదో నిషా అలా తలకెక్కేసింది. వెంటనే బ్రేమ్మలు సుబ్బారావుగారి దొడ్లో ఆవుదూడని దొంగక్రిష్ణుడి ద్వారా దొంగతనం చేయించి ద్రాక్షారామం సంతలో అమ్మించిన చంటమ్మ గుర్తుకొచ్చింది.

అంతే,

కూర్చున్న మనిషల్లా గభీల్మని లేచి వాళ్ళింటికి ఇంకో పక్కనున్న దొడ్లో తలుపులమ్మ ఇంట్లో ఉన్న బ్రేమ్మలు సుబ్బారావుగారి దగ్గరకెళ్ళి ఆ మధ్య జరిగిన స్టోరీ మొత్తం చెప్పేసేడు.

వెంటనే చిన్నం సత్యం జట్కా కట్టించుకుని రామచంద్రపురం పోలీస్టేషను కెళ్ళేడు బ్రేమ్మలు సుబ్బారావుగారు.

సైకిళ్ళమీద దిగిపోయిన పోలీసులు ఈంద్రపేటలో ఉండే దొంగక్రిష్ణుడి దగ్గరకెళ్ళి వాడి జుట్టట్టుకుని పాకలోంచి బయటికి లాగి తొడలమీద దద్దుర్లొచ్చేలాగ కర్రల్తో చితకబాదితే ''కొట్టకండి బాబోయ్ ఆ లేగదూడని దూళ్ళ వ్యాపారం చేసే ఈవూరి బుల్లియ్యకి అమ్మేను'' అన్నాడు.

దూళ్ళబుల్లియ్య ఇంటికెళ్ళి వాణ్ని బయటికి తీసుకొచ్చి మెత్తగా కొట్టేసేసరికి ''కొట్టకండి బాబోయ్ ద్రాక్షారం సంతలో ఉండూరు చౌదరిగారికి అమ్మేను'' అన్నాడు.

ఉండూరెళ్ళి ఆ చౌదర్ని చావగొడ్తే ''ఎక్కువ బాదకండి బాబోయ్ ఈ మధ్యే ఆపరేషను చేయించుకున్నాను ఆ దూడ మా పొలంలో మేస్తంది తోలికెళ్ళండి'' అన్నాడు.

బ్రేమ్మలు సుబ్బారావుగారికి ఆ లేగదూడని అప్పగించేసిన పోలీసులు మొత్తం అందర్నీ తీసుకెళ్ళి ఒకే సెల్లోకి తోసేసేరు. కాస్త దూరంగా ప్రెసిడెంటు కర్రెంకయ్యగారి పక్కన నిలబడున్న పుత్రయ్యని పిల్చిన సెల్లో చంటమ్మ ''ఏం పాపంచేసేమని మమ్మల్నందర్నీ ఇలా పులుసులోకి ఎముక మిగలకుండా చావబాదించేవురా'' అనడిగింది.

''అడిగిన వెంటనే ఆ అయిదూ ఇచ్చేస్తే ఏ పెంటా లేకుండా పోయేదిగందా'' అనేసరికి ఇంకోసారి గొళ్ళుమంది చంటమ్మ ''ఎదవసచ్చినోడా... నీ నోట్లో నోరెట్టకూడదు'' అంది.

''లేడీసుగాబట్టి పెట్టినా బానే ఉంటదేమో'' అన్నాడు పుత్రయ్య.

కర్రిమాణిక్యంగారి చిన్నమ్మాయి కొడుక్కి మార్టేరోళ్ళ దగ్గర కట్నం డబ్బులు గదమాయించి తీసుకున్న విషయం, రామచంద్రపురం క్రిస్టియన్ కాంపౌండ్లో పిల్లని ప్రేమించిన నల్లమిల్లిరామారెడ్డిగారి ఈశ్వర్రెడ్డి కొప్పవరపోళ్ళ పిల్లని రాత్రికి రాత్రి సోమేశ్వరం గుళ్ళో పెళ్ళి చేసుకున్న విషయం రామచంద్రపురమెళ్ళి పోలీసులకి చెప్పి అరెస్టు చేయించేడు. పొట్టిసూరమ్మ రెండోకొడుకైన పొట్టోడు (అసలు పేరు నల్లమిల్లి రామచంద్రారెడ్డి) కుంటి శేషమ్మకి కడుపు చేసి (ఒకసారిగాదు రెండుసార్లు) రాత్రికి రాత్రి బలభద్రపురంలో చెల్లెలి వరసైన సీత

(ఒక కాలు ఫైలేరియా) అనే అమ్మాయిని పెళ్ళి చేసేసుకున్న విషయం ఊరంతా చాటింపేయించి మరీ చెప్పేడు.

* * *

తాగున్నప్పుడు పుత్రయ్యగాడి పెంటపన్లకి జడిసిపోయిన వూరి జనం ప్రెసిడెంటు కర్రెంకయ్యగారి దగ్గరకెళ్ళి ''అసలు ఈవూళ్ళో సారాకొట్టే లేకుండా చెయ్యాలి మీరు''అన్నారు. ఆలోచించిన కర్రెంకయ్య ''ఆపుత్రయ్యగాడు చేసేది ఆడి అవసరం కోసమైనా ఊళ్ళో చేసే ఎదవపన్లూ, అన్యాయాలూ బాగానే బయటెడ్తున్నాడు. ఆడలాగ కొన్నాళ్ళుంటే ఈ పెంట పన్లు చేసేవోళ్ళంతా కాస్త పల్చబడతారేమో'' అన్నాడు.

''మీరలాగంటే మేం మస్సై పోతాం. ఇంక ఊళ్ళో ఎలాంటిచెడ్డా జరక్కండా చూసుకునే పూచీ మాది. మీరు మట్టుకు ఈ ఊళ్ళో సారా అమ్మకం అనేది లేకండా చేసి పుణ్యం కట్టుకోండి..బాబ్బాబూ'' అన్నారు.

దాంతో,  ఊళ్ళో ఎక్కడా సారా అమ్మకూడదని టముకేయించేడు. ఊరు నాలుగు మూలల్లో ఎక్కడా ఆఖరిశివారుల్లో కూడా కల్లుగియ్యకూడదు అని రూల్సు పెట్టేసేరు ప్రెసిడెంటు కర్రెంకయ్యగారు. ఆ దెబ్బకి, ఊళ్ళో తాగుబోతులకి బాగా యిబ్బంది కలిగి వాళ్ళు లబోదిబోమని ఏడుస్తున్నా, ఆ పుత్రయ్యగాడి పెంట ఒదిలిపోయినందుకు చాలా ఆనందపడ్డారు. ఆ ఆనందం అంతా ఇంతా కాదు. అయితే ఊళ్ళో దొంగతనాలూ, పేకాటలూ, అక్రమంగా ఆడోళ్ళ సంగతులూ, కట్నం గొడవలూ చాటుమాటుగా గుట్టు చప్పుడు గాకుండా జరుగుతానే ఉన్నాయిగానీ, ఆ పుత్రయ్యగాడు మాత్రం మటుమాయం అయిపోయేడు. ఆంజనేయస్వామి పటం ముందు కూర్చుని అంజనం వేసినా కనపడ్డం లేదు పుత్రయ్య.

* * *

ఆవేళ,

అమావాస్య ఆదివారం.

ఊర్ని చిక్కగా అల్లుకుంది చీకటి. ఎక్కడాగాలి ఆడక ఉక్కగా ఉంది. దూరంగా సూడికుక్క మొరుగుతా ఉంది. పిచ్చాడెవడో పేలతాపోతున్నాడు. భూతవైద్యం చేసే వెలగల గోపాలరెడ్డి స్మశానం వేపెళ్తున్నాడు.

సరిగ్గా ఆ టైములో పరిగెట్టుకుంటా వచ్చిన కోరి నారాయణరెడ్డిగారి పెద్దోడు బొణుగు ఊళ్ళో ''ఉప్పు మందయ్యగారింటవతల ఎవరో సారా తయారు చేస్తున్నారు'' అన్నవార్త మోసుకొచ్చేడు.

అది విన్న ఊరిజనం ఎకాఎకిన పరిగెత్తుకుంటా వెళ్ళేరు దేవాంగులపేటలోకి.

ఉప్పు మందయ్యగారింటి పక్కన చెల్లూరు సుగరు ఫ్యాక్టరీలో ఆరెంపీ డాక్టరు కృష్ణమూర్తి ఇంటెనకాల కెళ్ళి వెతికితే చిన్నపాకలో బాగా పులచబెట్టిన బియ్యం కడుగుతో సారా తయారుచేస్తా కనిపించేడు ఓ మనిషి.

అదిచూసి గుండెలు బాదేసుకుంటున్నారు  ఊరిజనం.

ఆళ్ళ మధ్యలో కొచ్చిన ఆ మనిషి ''ఒక్కసారి ఏడుపులాపి తలో గ్లాసు పుచ్చుకుని కొత్తసారా రుచి ఎలాగుందో చెప్పండి'' అన్నాడు. ఇంతకీ ఆ మనిషెవరంటే ———

తూరుప్పేటలో పుత్రయ్య.